డి.ఏ.వి పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర-రాజాం : తేదిన జమ్మూ కాశ్మీర్‌లో గల పహల్గామ్లో ఏప్రిల్ 22న జరిగిన ఘోర ఉగ్రదాడికి గురై చనిపోయిన 26మంది భారతీయుల ఆత్మకు శాంతి చేకూరాలని జి.యమ్.ఆర్. వరలక్ష్మి. డి.ఎ.వి పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ప్రదర్శనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.విజయకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయలు, విద్యార్థినీ, విద్యార్థులందరూ చనిపోయినవారికి శాంతి చేకూరాలని రెండు నిమషాలపాటు మౌనం పాటించి, పాఠశాల ప్రాంగణంలో కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సంధర్భంగా ప్రధానోపాధ్యాయులు జి.విజయకుమార్ మాట్లాడుతూ ఈ హృదయ విదారక సంఘటనను ఎంతోగానో దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఈ తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు భారతీయులతో పాటు ప్రపంచమంతా ఏకమై ఇటువంటి ఘోర దుర్ఘటనలు భవిష్యత్తులో ఎప్పుడూ జరగకుండా ఉండాలని ఆయన సందేశాన్ని ఇచ్చారు.

పిడుగు పడి మూడేళ్ల బాలుడు, ఒక ఆవు మృతి

మరొకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : మండలంలోని దారపర్తి పంచాయతీ, పొర్లు గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి పిడుగు పడి మూడవ తరగతి చదువుతున్న, కేరంగి కిరణ్ (8) బాలుడుతో పాటు ఒక ఆవు మృతి చెందగా బోయిన అనిల్ (19) అనే యువకుడికి గాయాలయ్యాయి. వీరిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు గాయాలైన బోయిన అనిల్ నాకు మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్ కు రెఫర్ చేశారు. వర్షానికి చెట్టు వద్దకు చేరగా అప్పుడే పిడుగు పడి ఈ ప్రమాదం సంభవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పర్యటన

విశాలాంధ్ర-బొబ్బిలి : మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీరు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో అప్పయ్య పేట, మహారాణిపేట, గొల్ల వీధి, పూల్ బాగ్, మార్కెట్ ఏరియా, మేదరబంద రోడ్డు మరియు జయప్రకాష్ స్కూల్ రోడ్డు ప్రాంతాలలో పర్యటించారు. నిన్న కురిసిన అకాల వర్షానికి గాను జలమయమైన ప్రాంతాలను పరిశీలించి త్వరిత గతిన శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని శానిటరీ ఇన్స్పెక్టర్ వారికి ఆదేశించారు. అప్పయ్యపేట స్మశాన వాటికలో ఇటీవల నిర్మించిన ఎప్రోచ్ రోడ్‌ను పరిశీలించి, ప్రహరీ గోడను నిర్మించుటకు అంచనాలు తయారు చేయాల్సిందిగా మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర గుప్త వారికి ఆదేశించారు. మహారాణిపేట, గొల్ల వీధి మరియు పూల్ బాగ్ ఏరియాలలో శానిటేషన్‌ను పరిశీలించారు. నూతనంగా చేపట్టిన పైప్ లైన్ పనులను పరిశీలించి మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వారికి సూచనలు జారీ చేశారు. గొల్లపల్లి గ్రామదేవత పండుగను పురస్కరించుకొని రథం తిరుగు ప్రాంతాలలో చేపట్టవలసిన మరమ్మత్తులు మరియు శానిటేషన్ పనుల గురించి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్ వారితో చర్చించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐటిఐ పాసైనవారికి ఉద్యోగావకాశాలు

ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టివి. గిరి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ఐటిఐ పాసైన అభ్యర్థులకు జిల్లాలోని మైలాన్ పరి శ్రమలో అప్రెంటీస్ ఖాళీలు ఉన్నాయని,అలాగే విజయనగర్ బయోటెక్ పరిశ్రమలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి బుధవారం తెలిపారు. అభ్యర్థులు ఐటిఐలలో ఫిట్టర్ లేదా ఎలక్ట్రీషియన్ కోర్సులు చేసి వుండాలని తెలిపారు. అభ్యర్థులు తమ పదవ తరగతి సర్టిఫికేట్, ఐటిఐ సర్టిఫికేట్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ పోటోలు 2తోపాటు బయోడేటా తీసుకురావాల్సి ఉందన్నారు. మే 2వ తేదీలోగా ప్రభుత్వ ఐటిఐలో తనను నేరుగా గానీ, 9849118075ను సంప్రదించాలన్నారు.

నూతన ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలోని భోగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన నూతన ఆపరేషన్ థియేటర్‌ను బుధవారం శాసన సభ్యురాలు లోకం మాధవి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమయానికి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తాజా పరికరాలతో సమీకృతంగా రూపొందించిన ఈ ఆపరేషన్ థియేటర్ వల్ల గర్భిణీలు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించవచ్చని అన్నారు. ఆరోగ్య రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలులోకి తేవడానికి ప్రాధాన్యతనిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కిమిడిని సత్కరించిన పిఏసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్

విశాలాంధ్ర-చీపురుపల్లి : డిసిసిబి చైర్మన్‌గా నియమితులైన జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునను విజయనగరం పిఏసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. చీపురుపల్లిలోని కిమిడి స్వగృహానికి యూనియన్ గౌరవాధ్యక్షులు పి.కామేశ్వరరావు ఆద్వర్యంలో నేతలు అంతా వెళ్ళి ముందుగా ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం దుశ్శాలువ కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేసారు. అనంతరం కొద్ది సేపు డిసిసిబికి సంభందించిన విషయాలపై మాట్లాడారు. అందరి సహకారంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన అన్నారు. కిమిడిని నాగార్జునను కలిసిన వారిలో పిఏసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రెడ్డి సత్యారావు, ప్రధాన కార్యదర్శి బి. రామునాయుడు, కోశాధికారి ఎ.వి.సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఆర్‌వి.జె.నాయుడు, బలరామ్, పాండురంగ, గిరిబాబు, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

కార్మిక, కర్షక సోదరులకు మేడే శుభాకాంక్షలు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ

విశాలాంధ్ర-విజయనగరం : కార్మిక, కర్షకులకు పండగ దినమైన మే 1న అందరూ ఆనందంగా వేడుకలను జరుపుకోవాలని, కార్మిక, కర్షక సోదరులకు మేడే శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని తెలిపారు. పెట్టుబడి దారీ వర్గం వెట్టి చాకిరీ నుంచి కార్మిక వర్గం విముక్తి పొందిన ప్రపంచ కార్మిక దినోత్సవమే మేడే అని తెలిపారు. 139వ మేడే రోజున వాడవాడలా సిపిఐ, ఎఐటీయుసి జెండాలు ఎగురవేసి, కార్మిక అమర వీరులకు నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు. ఈ మేడేను కార్మిక లోకమంతా ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కవి శ్రీశ్రీ

కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జె సి రాజు

విశాలాంధ్ర-బొబ్బిలి : జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కవి కర్షకుడు, మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) అని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్, కారుణ్య సంస్థ వ్యవస్థాపక చైర్మన్ జె సి రాజు అన్నారు. బుధవారం స్థానిక కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో మహాకవి శ్రీశ్రీ 115వ జయంతిని రోటరీ, కారుణ్య సంస్థల ఆద్వర్యంలో నిర్వహించారు. శ్రీశ్రీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జె.సి.రాజు మాట్లాడుతుతెలుగు సాహిత్యంలో విప్లవ కవిగా, హేతువాదిగా, నాస్తికుడిగా అభ్యుదయ కవిగా ప్రసిద్ధి పొందారన్నారు. ఆయన చేసిన రచనల్లో మహా ప్రస్థానంలి కవితా సంకలనం తెలుగు సాహిత్యంలో ఒక మైలు రాయిగా నిలిచిందన్నారు. తూటాల్లాంటి మాటలతో ఆకలి రాజ్యంపై రక్తాక్షరాలు చిందించిన శ్రీశ్రీ మరణించేవరకు మార్క్సి జాన్నే నమ్మారన్నారు. పేద ప్రజల జీవన వృత్తాంతాలతో ఏమైనా రచనలు, సిద్ధాంతాలు ఉన్నాయంటే అవి శ్రీశ్రీ రచనలే నని అన్నారు. సినిమా రంగంలో ఆయన రాసిన పాటల ద్వారా తనదైన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. ప్రజలు మాట్లాడుకునే భాషలో తేలికగా అర్ధమయ్యేలా పాటలు కవిత్వాలు, రచనలు చేసి తెలుగు భాషాభివృద్ధికి దోహదంచేసిన అభ్యుదయ కవి శ్రీశ్రీ అని నేడు ఎందరో సాహితీవేత్తల కు ఆయన ఆదర్శం అని అన్నారు.సమ సమాజాన్ని స్థాపించటమే లక్ష్యంగా రచనలు చేసిన శ్రీశ్రీ చిరస్మరనియుడని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎమ్ శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు శ్రీహరి వెంకట శివకాంత్, కృష్ణమోహన్ కారుణ్య ఫౌండషన్ సభ్యులు యుగంధర్, రాజు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుమరాం శ్రీపైడితల్లెమ్మ ఆలయ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన గ్రామస్థులు

విశాలాంధ్ర-జామి : మండలంలోని కుమరాం గ్రామ దేవత శ్రీపైడితల్లెమ్మ అమ్మవారి నూతన ఆలయం, నూతన విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలను మూడురోజులపాటు గ్రామస్థులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈనెల 28నుంచి 30 వరకు ఈఉత్సవాలు జరిగాయి. ఆలయ అర్చకులు అక్కాజోష్యుల వెంకట బుశ్శీ శృంగశర్మ ఆద్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ ప్రతిష్టా మహోత్సవాలను నిర్వహించారు. ఎంతో సుందరంగా నిర్మించిన ఆలయాన్ని, విగ్రహాన్ని రూపాన్ని చూసి ప్రజలు తన్మయత్వంతో నిండిపోయారు. మహిళలు పసుపు, కుంకుమలతో గ్రామంలో అమ్మవారికి ఘటాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి శుద్ధి స్నానం చేయించారు. గ్రామ పెద్దలు నిరంతర పర్యవేక్షణలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుని మహోత్సవాలను విజయవంతం చేసారు.

భక్తుల మృతిపై దిగ్భ్రాంతి : మాజీ ఎంపీ బెల్లాన

విశాలాంధ్ర-చీపురుపల్లి : సింహాచలం చందనోత్సవంలో భక్తుల మృతిపై విజయనగరం జిల్లా మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం నాడు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రమాద ఘటన పైన విచారం వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడ కుప్పకూలి భక్తులు మృతి చెందడం బాధ కలిగిస్తుంది అన్నారు. అదేవిధంగా చీపురుపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు ఇప్పిలి వెంకటనర్సమ్మ కూడా ప్రమాద సంఘటన పైన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందనోత్సవం సందర్భంగా రూ.300 టికెట్ క్యూలైన్ పైగోడ కుప్పకూలి భక్తులు మృత్యువాత పడటంపై తీవ్రవిచారం వ్యక్తం చేశారు. స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఇటువంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పాఠశాలలకు పంపిణీ జరిగేలా ప్రణాళిక రూపొందించాలి

మండల విద్యాశాఖ అధికారులు ప్రవీణ్ కుమార్, జగదీశ్వరి వెల్లడి

విశాలాంధ్ర-వంగర : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర(ఎస్ ఆర్ కె వి ఎం) కిట్లు పంపిణీకి ప్రణాళిక రూపొందించాలని వంగర మండల విద్యాశాఖ-1 పి.ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ-2కే జగదీశ్వరి పేర్కొన్నారు. మంగళవారం వంగర మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్ ఆర్ కె వి ఎం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు, నోట్ పుస్తకాలు, గ్రాఫ్ బుక్‌లు, యూనిఫామ్‌లు, షూస్, సాక్స్‌లు ,బెల్టులు, బ్యాగులు, వంటి వస్తువులతో కూడిన కిట్లు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ కిట్లు జిల్లా నుంచి మండలానికికు వస్తాయన్నారు. మండలానికి వచ్చిన కిట్లు ప్రతి పాఠశాలకు సక్రమంగా పంపిణీ జరిగేటట్లు సిబ్బంది సరైన ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ కొప్పర హెచ్‌ఎం సత్యనారాయణ,మిస్ కో-ఆర్డినేటర్ కిరణ్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తవిటి నాయుడు, సిఆర్‌ఎంటీలు గణపతి, వాసు, అనురాధ, ప్రేమ్‌కుమార్, శ్రీను,సాంబశివరావు, పిటిఐలు పోలినాయుడు, విజయ, గోపి, పారయ్య సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా బలోపేతమే లక్ష్యం

- పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం దిశగానే నిరంతర అడుగులు
- అధినేతకు రుణపడి ఉంటా : డీసీసీబీ అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు డీసీసీబీ చైర్మన్‌గా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. గత ఆరేడేళ్లుగా తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమం దిశగానే తన అడుగులు పడ్డాయని చెప్పారు. భవిష్యత్తులోనూ పార్టీ కోసం అహర్నిశలూ శ్రమిస్తానని.. అన్ని వేళలా వెన్నంటే ఉంటున్న శ్రేణులకు అండగా నిలుస్తానని తెలిపారు. డీసీసీబీ అధ్యక్షులుగా నియమితులైన కిమిడి నాగార్జున.. బుధవారం ఉదయం విజయనగరంలోని పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కష్టపడి పని చేసే నాయకులకు, కార్యకర్తలకు తెదేపాలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. డీసీసీబీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు రుణపడి ఉంటానని చెప్పారు.

అభినందనల వెల్లువ.. జిల్లాలో కీలకమైన నామినేటెడ్ పదవి దక్కించుకున్న నాగార్జునకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ జిల్లా కార్యాలయం అశోక్‌బంగ్లాలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐవీపీ రాజు, కొండపల్లి కొండలరావు, కొండపల్లి భాస్కరనాయుడు, పతివాడ అప్పలనారాయణ, అల్లు విజయ్‌కుమార్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు, చిల్ల పద్మ, చీకటి సుహాసిని, పతివాడ విద్యాసాగర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీరంటే నాకు కోపం కాదు... పొల్యూషన్ విషయంలో రాజీ పడేది లేదు

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి

విశాలాంధ్ర-పూసపాటిరేగ : నాకు మీరు అంటే కోపం లేదు కానీ పచ్చని పొలాల్లోకి, భూమిలోకి విషపూరితమైన నీటిని వదిలితే ఊరుకునేది లేదని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. బుధవారం ఉదయం లంకలపల్లి పాలెం గ్రామంలో అరవింద్ ఫార్మా కంపెనీ వారు నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మా కంపెనీలు వాటి వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా ప్రకృతి వనరులలోకి వదిలేయటం వల్ల ఈ ప్రదేశంలో ఊర్లు భూగర్భ జలాల పాడైపోయాయని, ఈ చర్యలను నేను ఉపేక్షించనని ఇంత అందమైన, బలమైన బిల్డింగ్ కట్టి ఇక్కడ నివసించడానికి యోగ్యంగా లేకపోతే ఎన్ని బిల్డింగులు కట్టి ఏమి ప్రయోజనం అని కర్మాగార ప్రతినిధులతో ఆమె అన్నారు. మండలంలో మంచినీటి సరఫరా కోసం శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోన్నామని రామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పూర్తి ఐతే నియోజక వర్గానికి నీటి కొరత తీరు పోతుందని ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు నీటి ఎద్దడిని తట్టుకోవడానికి బోర్ వెల్స్ మీద అదర పడటంతో వాటిని ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేస్తున్నాము అని చెప్పారు. మండలానికి పాలెం ఒక శ్రీలంక లాగ మిగిలిపోయిందని రోడ్డు కనెక్టివిటీ కావాలని అడగగా కోనయ్యపాలెం టు చింతపల్లి కనెక్టివిటీ రోడ్డు వేయటానికి గ్రామ తీర్మానం చేసి పంపాలని ఆమె అన్నారు. అంతరం ఫార్మా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ చాలా గ్రామాలలో వాళ్ళు ప్రొవైడ్ చేసిన వాటర్ ప్యూరిఫైర్స్ ప్లాంట్స్ అన్ని పాడైపోయిన పట్టించుకోవటం లేదని వాటిని వెంటనే రిపేర్ చేసి వేసవి నీటి అవసరాలు తీర్చాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పెద్దలు, సర్పంచ్, రౌతు సాయి, జనసేన నాయకులు రౌతు ఉపేంద్ర, జనసేన మండల అధ్యక్షుడు జలపార శివ, జనసేన మండల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పన్ను ఎగవేతదారులపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలి

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం: పన్ను ఎగవేతదారులకు సంభందించి ఎఫ్.ఐ.ఆర్‌లను నమోదు చేయించుటకు పోలీస్ యంత్రాంగం వారుతో చర్చించి తహసిల్దార్లుతో సమన్వయము చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్ర పన్నుల సంయుక్త కమీషనర్, ఉప కమీషనర్, జిల్లా సర్వే మరియు భూమి రికార్డుల అధికారి, సంబంధిత తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఆయన ఛాంబర్ లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ వారు జి.ఎస్.టి బకాయిలు, జనరల్ సేల్స్ టాక్స్, వ్యాట్ చట్టంలో గల బకాయిలు, రెవిన్యూ రికవరీ కేసులకు సంభందించి, పన్ను ఎగావేతదారుల నుండి బకాయి రాబట్టుటకు జిల్లా యంత్రాంగం సహకారం కోరడమైనది. జెసి స్పందిస్తూ మండల పరిషత్ అభివృధి అధికారులు, తహసిల్దారులకు మార్గనిర్దేశం చేసారు. సరియైన ప్రణాళికను సిద్ధం చేయవలసిందిగా సంయుక్త కమీషనర్, రాష్ట్రపన్నులు మరియు ఉప కమీషనర్ రాష్ట్రపన్నుల వారికి సూచించారు. అందులో భాగముగా ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ రికవరీ చట్టంలో గల కేసులకు సంభందించి చట్ట ప్రకారం తగు అనుమతులను మంజూరు చేయుటకు మరియి సెంట్రల్ రెవిన్యూ రికవరీ చట్టం గల కేసులకు సంభందించి ఉత్తర ప్రత్యుత్తరములు చేయుటకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో అదనపు ఎస్.పి సౌమ్య లత, ఆర్.డి.ఓ కీర్తి, జిల్లా అధికారులు, సంయుక్త కమీషనర్, రాష్ట్ర పన్నులుబీ ఉప కమీషనర్, రాష్ట్ర పన్నులుబీ జిల్లా సర్వే మరియు భూమి రికార్డుల అధికారి, విజయనగరంబీ సంబందిత తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

విజనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా హెచ్ సన్యాసిరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాలు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం విద్యాసాగర్ సన్యాసిరావు (నానాజీ)కి నియామక పత్రాలు అందించారు ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ మండలంలోని నియోజక వర్గంలోని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు ఈ నియామకంపై శృంగవరపుకోట మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలు, మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సింహాచలం ఘటనపై ఎమ్మెల్యే కోండ్రు సంతాపం

విశాలాంధ్ర- రాజాం : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సింహాచలంలోని ఆలయంలో జరిగిన ప్రమాదంపై సంతాపం వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. చందనోత్సవ సమయంలో ఇలాంటి ఘటన జరగటం దురదృష్టకరమన్నారు. ఈదురు గాలి, వాన బీభత్సంతో జరిగిన ప్రమాదం విచారకర మన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి గాయపడ్డ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతి చెందిన వారి కుటుంబానికి 25లక్షలు, గాయపడ్డ వారికి మూడు లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లు పేర్కొన్నారు. పీఎం సహాయనిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున కేంద్రం పరిహారం ప్రకటించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

46 మందికి ఉచిత కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : కేంద్రం యొక్క వస్త్ర రంగంలో సామర్థ్య నిర్మాణ పథకం క్రింద ఎస్.కోటలో 46 మంది కుట్టు శిక్షణ (కుట్టు మిషన్ ఆపరేటర్) పూర్తిచేసి సర్టిఫికేట్లు పొందారు. ఈరోజు కౌముద్ ఎగ్జామ్ శిక్షణ కేంద్రంలో జరిగిన వేడుకలో ఎం. మనీ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ శిక్షణ ద్వారా టెక్స్టైల్స్ రంగంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డి సూర్యారావు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను అధ్యయనం చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి

విశాలాంధ్ర-విజయనగరం : మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి, వారి గొప్పదనాన్ని ప్రతీఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంబేద్కర్, బసవుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహానుభావుల త్యాగం, గొప్పదనాన్ని ప్రతీఒక్కరూ తెలుసుకొని చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం గొప్పవారి జీవిత చరిత్రలను చదవాలన్నారు. దీనికోసం మహనీయుల వర్ధంతులను, జయంతులను ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే సామాజిక న్యాయం కోసం పాటుపడ్డారని కొనియాడారు. సమాజంలో కుల వ్యవస్థ, వర్ణ బేధాలను, లింగ వివక్షతను వ్యతిరేకించి, లింగాయత్ ధర్మాన్ని స్థాపించారని చెప్పారు. అప్పట్లోనే సామాజిక చైతన్యం కోసం కృషి చేసిన బసవేశ్వరుడు, తదనంతర కాలంలో ఎంతోమంది చైతన్యకారులకు స్ఫూర్తి నిచ్చారని అన్నారు. ముందుగా సెట్విజ్ ఇన్‌ఛార్జి సిఈఓ సోమేశ్వరరావు మాట్లాడుతూ బసవేశ్వరుడి జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం అధికారి కుమాస్వామి, సెట్విజ్ సిఈఓ బివి సత్యనారాయణ, డివిఓ టి.వెంకటేశ్వరరావు, జెడిఏ తారకరామారావు, కలెక్టరేట్ ఏఓ దేవ్ ప్రసాద్, ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కరెంట్ షాకుతో వ్యక్తికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-వంగర : మండలంలో అరసాడ గ్రామం వద్ద విద్యుత్ షాకుకు గురై రంగోలి సత్యన్నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి.బుధవారం నాడు ఓని మగ్గూరుగ్రామానికి చెందిన రంగోలి సత్యన్నారాయణ అరసాడ పెట్రోలు బంకు సెంటర్లో భవనాలు మీదుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సమయంలో కరెంట్ వైర్లకు తగలటంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలు పాలయ్యారు. ఒళ్ళంతా చర్మం ఊడి తీవ్రగాయాలు పాలై తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందజేయటంతో వెంటనే 108 సిబ్బంది ఈఎంటి విశ్వనాథం, పైలట్ విశ్వనాధంలు ప్రధమ చికత్స చేసి రాజాం గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు.

అన్న సమారాధనకు విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో చెల్లాపురం గ్రామంలో పునర్నిర్మానం చేస్తున్న శ్రీ కోదండరామ ఆలయ ప్రతిష్టకు ఆహ్వానం తెలియజేయదానికి వెళ్లిన పి ఆర్ టి యు స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఆల్తి రాంబాబు చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు ఇంటికి వెళ్లారు. ప్రతిష్ట కార్యక్రమాలు గురించి తెలుసుకొని చివరి రోజు మహా అన్న సమారాధనకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు జిల్లా ప్రధాన కార్యదర్శి సాసుబిల్లి రామునాయుడు పత్తి గుల్ల రామారావు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సిఎన్ఎస్ టవర్లు ఏర్పాటు

విశాలాంధ్ర-భోగాపురం : అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విమానాల ల్యాండింగ్‌లకు సహాయపడటానికి కమ్యూనికేషన్ నావిగేషన్ సర్వలెన్స్ టవర్లను బుధవారం ఎయిర్పోర్ట్‌లో ఏర్పాటు చేసారు. ఈ సిఎంఎస్ టవర్లు విమానయానంలో సురక్షితమైన, సమర్థవంతమైన ఆపరేషన్లకు సహాయపడతాయి. అవి విమానాల మధ్య కమ్యూనికేషన్ సమాచార మార్పిడిని సులభతరం చేస్తాయి, విమానం స్థానాన్ని గుర్తించడంలో సహాయపడతాయి మరియు విమాన ట్రాకింగ్‌ను మెరుగుపరుస్తాయి.

గంటి కొండకి గడ్డుకాలం...

- ఫారెస్ట్ అధికారులకు కాసుల వర్షం..
- తరిగిపోతున్న అటవీ సంపద... దర్శనమిస్తున్న నరికేసిన మొదల్లు...
- మాయమైన చెట్లపై విచారణ చేయించాలి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : కంచె చేను మేయటం అంటే ఇదేనేమో. తలుపు తాళం లేని సంపదగా అటవీ సంపదను చూస్తాం దీనికి అటవీశాఖ అధికారులే రక్షణగా నిలవాలి కానీ రక్షకులే భక్షకులుగా మారి అక్రమాలకు అండగా నిలవడంతో కోట్ల విలువైన అటవీ సంపద ఆవిరవుతుంది. మండలంలోని గంటి కొండ అటవీ ప్రాంతం నుంచి

నిత్య కృత్యమవుతున్న కలప అక్రమ రవాణా ఇందుకు నిదర్శనం ఓ పక్క ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాల ద్వారా చెట్లను పెంచాలని వాటిని సౌరక్షించాలని చెబుతుంటే మరోపక్క అదే అధికారులు సంపదను కొల్లగొట్టి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నారు అటవీ ప్రాంతాలలో వ్యాపారులతో కుమ్మక్కై భారీ వృక్షాలను సైతం తరలించక పోవడంతో పచ్చదనం కొరవడి వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని పలువురు భావిస్తున్నారు. అటవీ సంపద అక్రమ రవాణా వెనుక అటవీశాఖ అధికారుల అవినీతి ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పర్యావరణానికి ఆటంకపరుస్తూ వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ గంటి కొండ ఫారెస్ట్ లో మాయం చేసిన టేకు చెట్ల విషయములో విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోని మరల చెట్లను నాటే కార్యక్రమాలు చేపట్టాలని వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తూ అడవులను రక్షించే విషయములో అటవీశాఖ అధికారులు కటువుగా వ్యవహరించి పచ్చదనాన్ని పెంపొందించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

బైరిపురంలో ఘనంగా శ్రీ మజ్జి గౌరమ్మ తల్లి పండుగ

అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్న భక్తులు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మెరకముడిదాం మండలం బైరీపురం గ్రామంలో శ్రీ మజ్జి గౌరమ్మ తల్లి పండుగ బుధవారం నాడు ఘనంగా జరిగింది. బైరీపురం, లింగాలవలస, సరేయవలస గ్రామాలు ప్రజలు ఇలవేల్పు,ఆరాధ్య దైవం శ్రీ మజ్జి గౌరమ్మ తల్లికి ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరు అయ్యి పసుపు, కుంకుమలు, కొత్త వస్త్రాలు సమర్పించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతీ ఏటా మజ్జి గౌరమ్మ తల్లి పండుగ జరుపుకునే విధంగా ఈ సంవత్సరం కూడా ఘనంగా జరుపుకున్నారు.తల్లిని దర్శించుకునేందుకు లింగాలవలస, సరేయవలస, బైరీపురం గ్రామాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరు అయ్యి పూజలు నిర్వహించుకున్నారు. శ్రీ మజ్జి గౌరమ్మ తల్లికి ఆలయ ధర్మ కర్త కెంగువ ధనుంజయ కుటుంబ సమేతంగా పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించారు. తల్లి దర్శనానికి విచ్చేసిన భక్తులుకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. తల్లి ప్రసాదాన్ని భక్తులుకు ఆలయ కమిటీ పంచిపెట్టగా భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కెంగువ నరసింహ మూర్తి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మే 2 నుండి జూన్ 10 వరకు కిశోర్ వికాసం శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

సీడీపీఓ జాగాన విజయలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కిషోర్ వికాసం వేసవి శిక్షణా తరగతులపై మండల కమిటీ సమావేశం సీడీపీఓ జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.మే రెండవ తేదీ నుండి జూన్ 10 వరకు 15 నుంచి 18 సంవత్సరాలు కిషోర్ కిషోర్ వికాసం శిక్షణ బాలికలను గుర్తించి ఐదు నుండి 20 మంది పిల్లల వరకు ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వేలకు ప్రతి వారం మంగళ శుక్రవారం సమావేశం ఏర్పాటుచేసి ఉమెన్ ట్రాప్ కింగ్ ఆరోగ్య సమస్యలు నివారణ, బాల్య వివాహాలు వలన నష్టాలు ,రక్తహీనత తీసుకోవలసిన జాగ్రత్తలు నెలసరి సమయంలో పాటించవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవలసిన పోషకాహారము పై గ్రామంలో ఉన్న మహిళా పోలీస్ ఏఎన్ఎం ఆశ అంగనవాడి టీచర్ వివో ద్వారా వేళ్ళకు పిల్లలకు ఉషోర్ పాలకులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ శిక్షణా తరగతులకు మండల ఎద్యుకేషన్ అధికారుల సిహెచ్ లక్ష్మణరావు, మెడికల్ ఆఫీసర్ భరద్వాజ్, ఏపిఎం భాగ్యలక్ష్మి, సెక్టార్ సూపర్వైజర్స్ మహిళా పోలీసులు ఏఎన్ఎమ్స్ ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్స్ వివోలు పాల్గొన్నారు.

43వ డివిజన్లో పర్యటించిన కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య 43వ డివిజన్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలించారు. 52వ నెంబర్ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. పౌర సేవలు ఏ విధంగా అందిస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు. అనంతరం జనతా బజారు ప్రాంతంలో పర్యటించి, అక్కడ గుట్టలుగా చేరి ఉన్న చెత్త చెదరాలను చూసి వెంటనే వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో బాబ్ కార్టు సహాయంతో పెద్ద ఎత్తున పేరుకున్న చెత్తాచెదారాలను తరలించారు. ఆ తర్వాత నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఉన్న అన్నాక్యాంటీన్ వద్దకు చేరుకున్నారు. ప్రజలకు అందుతున్న అల్పాహారం ఇతర సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పూడికతీతను తొలగించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. అవి జరుగుతున్న ప్రక్రియలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ప్రజలు కూడా కాలువలో చెత్తాచెదారాలు వేయకుండా డస్ట్ బిన్లను వినియోగించుకోవాలని సూచించారు.

పండగ వాతావరణలో పైడితల్లెమ్మ సిరిమాను తరలింపు

విశాలాంధ్ర-జామి: గంట్యాడ మండలంలోని పెంటశ్రీరాంపురంలో ఉన్న గ్రామ దేవత శ్రీపైడితల్లెమ్మ అమ్మవారి పండగను గ్రామస్థులు దాదాపు 18 అనంతరం నిర్వహిస్తున్నారు. సిరిమాను పండగ కావడంతో అవసరమైన సిరిమానును అమ్మవారి ఆదేశాలమేరకు జామిలోని కొత్తలివారి కళ్లాల వద్ద చింతచెట్టును గుర్తించారు. అందులో భాగంగా బుధవారం పెంటశ్రీరాంపురం వాసులు బ్యాండు మేళాలతో, మహిళల పూజా కార్యక్రమాలతో అత్యంత వైభవంగా చెట్టు నరికివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో .ఆమి కొత్తలివారి కోవెల వాసులు సైతం సహాయం అందించారు. అనంతరం మధ్యాహ్నం అన్నధాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. చింత చెట్టును అత్యంత జాగ్రత్తగా పెంటశ్రీరాంపురం తరలించారు.

భక్తుల మృతిపై ఎంపీపీ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-గుర్ల : విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడ కుప్పకూలి భక్తులు మృతి చెందడంపై వైసీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందనోత్సవం సందర్భంగా రూ. 300 టికెట్ క్యూలైన్ పై గోడ కుప్పకూలి భక్తులు మృత్యువాత పడటంపై తీవ్రవిచారం వ్యక్తం చేశారు. స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఇటువంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-తెర్లాం : తెర్లాం స్థానిక గ్రంధాలయం లో వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా నిర్వహిస్తున్న తరగతులను స్థానిక మండల విద్యాశాఖాధికారి జే. త్రినాథ రావు పరిశీలించారు. విద్యార్థులు చదవడం, వ్రాయడం చూచి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు మంచి సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్ వై.శ్రీదేవి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 25 మంది విద్యార్థులు హాజరయ్యారని స్థానిక గ్రంధాలయం అధికారి సి.హెచ్.కృష్ణ మూర్తి తెలిపారు.

గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు

విశాలాంధ్ర-బాడంగి : స్థానిక బాడంగి గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు విద్యార్థుల కోసం బుధవారం నిర్వహించామని బాడింగి గ్రంథాలయం నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు గ్రంథాలయంలో పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై రవి బాబు విద్యార్థిని విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, తెలుగు పద్యాలు బోధించారు. విద్యార్థిని విద్యార్థులు ఏ విధంగా. సంఘంలో మెలగాలో ఒంటి విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. కొన్ని సంఘటనలను గుర్తు చేస్తూ పిల్లలకు అర్థమైన రీతిలో వివరించడం జరిగింది. తదుపరి బాడంగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు షేక్ రహీమ్ చిన్న పిల్లలతో నీతి కథలు చదివించడంతో పాటు ఆటలు,పాటలు పాడించారు. ఉపాధ్యాయులు లక్ష్మీ పార్వతీ విద్యార్థిని, విద్యార్థులకు మ్యాథ్స్ ట్రిక్స్ బోధించారు గ్రంథాలయాధికారి ఈ వేసవి విజ్ఞాన తరగతులు అందరూ వినియోగించుకోవాలి కోరారు.

పరామర్శ

విశాలాంధ్ర-రాజాం: స్థానిక పుత్సలవీధికి చెందిన మాజీ ఎంపిటిసి ఎ.జయలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని వైకాపా నియోజకవర్గం ఇన్చార్జ్ డా.తలే రాజేష్, టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, డా. నరేంద్ర తదితరులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : మండలంలోని కోరాడపేట వద్ద జాతీయ రహదారికి సమీపంలో రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీకి గురయింది. బుధవారం ఉదయం సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తస్కరించి అందులోనుంచి రాగిని తీసుకుపోయినట్లుగా గుర్తించారు. చోరీ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని లైన్‌మేన్ చంద్ర శేఖర్, ఎఎల్ఎం బాలు , జెఎల్ఎం శ్రీనులు తెలిపారు.

దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి లోగీస

విశాలాంధ్ర-చీపురుపల్లి : రాష్ట్రంలో దళితులను కేవలం ఓటు బ్యాంకులు గానే రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి లోగీశ రామకృష్ణ అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, స్త్రీ జనోధారకుడు అంబేద్కర్ చిత్ర పటం ప్రతి దళితుడు, పేదవాని ఇంట ఉండాలని రామకృష్ణ అన్నారు. ఎస్.సి ల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు రాజ్యాంగంలో హక్కులు, రిజర్వేషన్లు కల్పించడం వలనే ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా స్వతంత్రంగా తిరగలుగుతున్నార అన్నారు. రాజకీయ నాయకులు, దళితులకను కేవలం ఓటు బ్యాంకు చూస్తున్నారని వారికోసం ఏ పని చేయడం లేదన్నారు. ఎస్.సి లను ఎ.బి.సి లుగా వర్గీకరించడం దారుణం అని అన్నారు. రాబోవు రోజుల్లో రాజ్యాంగ హక్కులను తీసివేయడానికి రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతాయని వాటిని తిప్పికొట్టడానికి మాల లందరు ఐక్యంగా ఏకం కావాలన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పటం తో కూడిన క్యాలెండర్ లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. అలాగే చీపురుపల్లి నియోజకవర్గం మాల మహానాడు అధ్యక్షులుగా సబ్బీ సోనియాను నియమించినట్లు నియామక పత్రాలు అందించారు.ఆమెకు శాలువ కప్పి పూలమాల వేసి అంబేద్కర్ మెమెంటోతో సత్కరించారు. ఈ సమావేశంలో మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి చీడి. రామక్రిష్ణ, జిల్లా కార్యదర్శులు దేవర సంతోష్, లోగిశ.లక్ష్మణరావు, లోగిస.సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కివరపు.రాజు, దమరసింగి.రామారావు, కెవి ఆర్ సత్యనారాయణ, కక్కి భీమరాజు, సబ్బీ. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పదవుల కన్నా ప్రజాభిమానం గొప్పది

డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-చీపురుపల్లి : పదవుల కన్నా ప్రజాభిమానం గొప్పదని, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం చీపురుపల్లిలో శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఛైర్మన్ పదవిని దక్కించుకున్న అనంతరం కార్యకర్తలు, అభిమానులతో స్థానిక మూడు రోడ్ల కూడలి నుండి భారీ ఎత్తున బాణాసంచా సామాగ్రిని కాల్చి చీపురుపల్లి మండలం గ్రామం నందు వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన పదవి బాధ్యతలను ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ నిర్వహిస్తానని అన్నారు. తనకు అప్పజెప్పిన బాధ్యతతో నాయకులకు కార్యకర్తలకు అందు బాటులో ఉండడంతో పటు రైతాంగానికి పూర్తిస్థాయిలో తన వంతు సహకారాన్ని అందజేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. గత ఆరు ఏడు సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి తనవంతు శక్తి సామర్థ్యాలతో కృషి జరిపాను అన్నారు. తనకు లభించే ఈ పదవి కన్నా ప్రజాభిమానం గొప్పదని ఈ సందర్భంగా నాగార్జున గుర్తు చేశారు. ఈ పదవితో చీపురుపల్లికే కాకుండా జిల్లాకి కూడా తీసుకొస్తానని నాగార్జున అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఈవో బి శ్రీనివాస్ అమ్మవారి చిత్రపటానితో నాగార్జునను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం నాయకులు ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, బీసీ సెల్ అధ్యక్షులు ముల్లు రమణ, ఇల్లాపు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లకు రుణపడి ఉంటాను

- జిల్లా రైతుల కోసం పని చేస్తాను
- నాగార్జునకు వెల్లువెత్తుతున్న అభినందనలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఉమ్మడి విజయనగరం జిల్లా డీసిసిబీ ఛైర్మన్‌గా నియమించినందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ లకు రుణపడి ఉంటానని కిమిడి నాగార్జున అన్నారు. డిసీసీబీ ఛైర్మన్ పదవి కేటాయించిన తర్వాత మొదటిసారి చీపురుపల్లి తన నివాసానికి వచ్చిన నాగార్జనకు కార్యకర్తలు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా నాగార్జున నివాసం నుండి భారీ బైక్ ర్యాలీగా వెళ్లి శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడు సంవత్సరాలుగా చీపురుపల్లి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయదానికి సాయశక్తుల కృషిచేసానని అన్నారు. ఇకపై కూడా డీసిసిబీ ఛైర్మన్ గా పార్టీకి,రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేస్తానని అన్నారు. నాకు వచ్చిన పదవులకంటే, మీరు నాపై చూపించే అభిమానం పదవులకంటే గొప్పదని కార్యకర్తలనీ ఉద్దేశించి నాగార్జున మాట్లాడారు. ఇకపై చీపురుపల్లిని విజయనగరం తీసుకువెళ్లడం కాదు, విజయనగరాన్నే చీపురుపల్లికి తీసుకువస్తానని అన్నారు. నాగార్జున మాట్లాడుతుంటే కార్యకర్తలు ఆనంధోత్సవాల్లో మునిగితేలారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు కోట్ల కృష్ణమూర్తి నాయుడు, ముల్లు రమణ, రెడ్డి లక్ష్మణరావు, గొర్లె రామునాయుడు, మహంతి రమణమూర్తి,సారిక మోహన్, పనస మణికంత, రేగిడి వాసు, లెంక సూర్యనారాయణ, డి.రామునాయుడు, చిట్టయ్య, కిలారి సూర్యనారాయణ, బొత్స సాంబయ్య, ఆరతి సాహు, సబ్బి సోనీయా, కర్రోతు గోవింద, పిల్ల అప్పలనాయుడు, పున్నపురెడ్డి శ్రీనివాసరావు, మొండి దివాకరం, మీసాల కాశీ, పిల్ల అప్పారావు, మహంతి వాసు, ఏనేతల సూరిసత్యం, ఖమ్మండి శ్రీరాములు, గొర్లె గోవింద, యడ్ల అప్పలనాయుడు, యజ్జిపరపు సత్యం, నాగులపల్లి నారాయణరావు, పనస రవి, గడే సన్యాసప్పాల నాయుడు, గవిడి సూర్యనారాయణ, గునిడి సూర్యారావు, మీసాల శ్రీధర్ నాయుడు, తుమ్మగంటి గోవింద, పూసపాటిరేగ మండల నాయకులు మహంతి చిన్నంనాయుడు, ప్రసాదరావు, మహంతి శంకరరావు, మైలపల్లి సింహాచలం, దంగా భూలోక, వెంపడాపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్కృష్టమైనది : ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఉపాధ్యాయ వృత్తి ఉత్కృష్టమైనదని ఎంఎల్సి డాక్టర్ పివివిసూర్యనారాయణరాజు (సురేష్ బాబు) అన్నారు. నెల్లిమర్ల మండల విద్యాశాఖాధికారి-2 ఈపు విజయ్ కుమార్ ఉద్యోగ విరమణ ను పురస్కరించుకుని మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరజాపుపేటలోని ఓప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఎంఇఓ-1 యుఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని అన్నారు. వృత్తిలో అంకిత భావం ప్రదర్శించిన వారికి ప్రజల్లో ఎల్లపుడూ ఆదరణ, గుర్తింపు ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయ ఎంఎల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ విజయకుమార్ మాస్టారు ఉపాధ్యాయ వృత్తితో పాటు కళారంగంలో కూడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర జాతీయస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తెచ్చుకున్నారని అన్నారు. మాస్టార్ని మిగిలిన ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ తో పాటు మాజీ ఉపాధ్యాయ ఎంఎల్సె పాకలపాటి రమువర్మ, నగర పంచాయితీ చైర్పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, ఉప విద్యాశాఖాధికారులు రమణ, మోహనరావు ఎంఇఓలు శ్రీనివాసరావు, ప్రముఖ దర్శకుడు రచయిత,నటుడు కెకెఎల్ స్వామి. ఎంపిడీ ఓ రామకృష్ణరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కడలి సత్య సాయి గణేష్ మద్దుల సన్యాసిరావు, ఉండు శ్రీనివాసరావు, పతివాడ త్రినాధరావు,మద్దిల సత్యనారాయణ, తాలాడ మహేష్, కొత్తకోట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవలెను

ప్రిన్సిపల్ బి.భాస్కరరావు

విశాలాంధ్ర-రాజాం : ప్రభుత్వ ఐ.టి.ఐ., రాజాం నందు 2025-2026 సంవత్సరంనకు గాను అడ్మిషన్ల కొరకు ఉపాది మరియు శిక్షణా శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు దిగువ తెలిపిన వివిధ ట్రేడ్లలో సీట్లు భర్తీ చేయుటకు అర్హత కలిగన అభ్యర్థుల నుండి ఆన్లైన్ దరఖాస్తులు కోరడమైనది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్ వెబ్సైట్- డబల్యూ డబల్యూ డబల్యూ. ఐటిఐ. ఏపీ గవర్నమెంట్. ఇన్ లో తేది.24-05-2025 సాయంత్రం 5.00లోపు ధరఖాస్తు చేసుకోవలెను. (ఒక సంవత్సరం ట్రేడ్)

1. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (సిఓపిఎ)
2. మెకానిక్ డీజిల్

(రెండు సంవత్సరాల ట్రేడ్)1. ఫిట్టర్, 2.డ్రాఫ్ట్ మెన్ సివిల్‌కు సంబంధించిన అభ్యర్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ అనంతరం దగ్గరలో గల ప్రభుత్వ ఐ.టి.ఐ. లలో దిగువ తెలిపిన మీయొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో తేది. 26-05-2025 సాయంత్రం 5.00 లోపు హాజరై వెరిఫికేషన్ చేయించుకోవలెను. పై కోర్సులలో అడ్మిషన్ కొరకు ఆశక్తి గల అభ్యర్థులు తమ యొక్క ఎస్ఎస్సి స్టడీ సర్టిఫికెట్లు (ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు) ఈమధ్య చేయించుకున్న క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ కార్డ్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబర్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐ.టి.ఐ., వి.టి.అగ్రహారం, విజయనగరంలో జరుగు అడ్మిషన్ కౌన్సిలింగ్ కు హాజరుకాగలరు. తదుపరి వివరాలకు ప్రభుత్వ ఐ.టి.ఐ., రాజాంను సంప్రదించగలరు అని ప్రభుత్వ ఐ.టి.ఐ., రాజాం ప్రిన్సిపాల్ బి. భాస్కరరావు తెలియజేశారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9000096048, 8309438446, 9959502238, 9052085679. ఆన్లైన్‌లో దరఖాస్తు చివర తేదీ: 24-05-2025 సాయంత్రం 5.00 వరకు.ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చివరి తేది. 26-05-2025 సాయంత్రం 5.00 వరకు ఉంటుందని తెలియపరిచారు.

తాగునీరు అందించేందుకు చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-విజయనగరం : ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆయన ఆదేశాలతో పలు ప్రాంతాలలో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని సిబ్బంది ముమ్మరం చేశారు. అలాగే సచివాలయాల పరిధిలో ఎమినిటీస్ కార్యదర్శులు ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలను చేపడుతున్నారు. కుళాయిల ద్వారా నీటి పంపిణీ ప్రారంభించిన వెంటనే వచ్చే నీటిని క్లోరిన్ పరీక్షలను జరుపుతున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి అన్ని వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరచాలని ఇదివరకే సిబ్బందికి ఆదేశించి ఉన్నామని అన్నారు. దాని ప్రకారం వాటర్ ట్యాంకులను శుభ్రపరచి ఎప్పటికప్పుడు పూర్తి నాణ్యతతో కూడిన మంచినీటిని అందిస్తున్నామన్నారు.